క్లుప్తంగా

20న కొండనాగులలో మెగా జాబ్‌మేళా

బల్మూర్: ఈనెల 20న మండలంలోని కొండనాగుల శ్రీ ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పరంగి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాను ఐక్యూఏసీ, టీఎస్‌కేసీ కంపెనీల వారు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారితో పాటు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. ఈ జాబ్‌మేళాలో టెక్ మహీంద్ర, జెన్‌పాక్ట్, విప్రో, వీఎల్ఆర్ ఫర్టిలైజర్స్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, ఏపీఎస్ సిల్క్ అకాడమీ, హెచ్ఎస్‌బీసీ, హెడీఎఫ్‌సీ బ్యాంక్, 2050 హెల్త్ కేర్, జీనియస్ కన్సల్‌టెన్సీ, మొదలైన కంపెనీల వారు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ జాబ్‌మేళాకు వచ్చే అభ్యర్థులు తమ మెమో, ఆధార్‌కార్డు, పాస్‌ఫొటోలు తీసుకురావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15న సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఉప్పునుంతల మండలంలోని వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు అసోషియేషన్ అధ్యక్షులు ఎం.జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్ గురువారం ప్రకటనలో తెలిపారు.

బోయాపూర్‌లో డిజిటల్ క్రాప్ సర్వే

బిజినేపల్లి: మండలంలోని బోయాపూర్‌లో వ్యవసాయశాఖ అధికారులు గురువారం పంట క్షేత్రాలను సందర్శించి డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించారు. బోయాపూర్ గ్రామ శివారులో ఏఈఓ సర్వే నెంబర్ల, సబ్ డివిజన్ సర్వే నెంబర్ల వారీగా డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించి నమోదు చేశారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న పంటలను పెద్ద మొత్తంలో సాగు చేసినట్లు ఏఈఓ శారద తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గదులను పరిశీలించి గాలి, వెలుతురు, విద్యుత్ సౌకర్యం, కావలిసిన మెటీరియల్ వివరాలను హెచ్ఎం అనిల్‌కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి పవన్, కిరణ్ ఉన్నారు.

నేడు ఓటరు జాబితా విడుదల

కొల్లాపూర్: మండలంలోని బోయలపల్లి, తాళ్లనర్సింగాపురం గ్రామాల్లో శుక్రవారం ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. కొల్లాపూర్ మున్సిపాలిటీ నుంచి ఈ రెండు గ్రామాలను ఇటీవలనే తొలగించి గ్రామ పంచాయతీలుగా మార్చారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ రెండు గ్రామాలకు సంబంధించిన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు డీపీఓ రామ్మోహన్ షెడ్యూల్‌ను ప్రకటించారు. 14న ఓటర్ల వివరాలను వార్డుల వారీగా గ్రామాల్లో ప్రకటిస్తారు. 17 న అభ్యంతరాలు పరిశీలిస్తారు. 18న తుది జాబితాను ప్రచురించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎంఈఓ విచారణ



లింగాల: మండలంలోని శాయిన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలలో 1వ తరగతి విద్యార్థి శరత్ గదిలో ఉండగా తాళం వేసిన సంఘటనపై గురువారం ఎంఈఓ బషీర్ అహ్మద్ విచారణ నిర్వహించారు. పాఠశాలను సందర్శించిన ఆయన సంఘటనకు దారి తీసిన పరిస్థితులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.పాఠశాల ముగిసిన సమయంలో గదులను క్షుణ్ణంగా పరిశీలించక పోవడం తప్పిదం అవుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవని ఎంఈఓ తెలిపారు. ఉద్దేశ్యపూ ర్వకంగా చేసింది కాదని హెచ్ఎం గణేష్ ఎంఈఓకు రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తెలకపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలో దుందుభీ వాగు నుంచి అనుమతి లేకుండా ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్‌లో పోలీసులు పట్టుకు న్నారు. గడ్డంపల్లికి చెందిన ట్రాక్టర్ యజమాని బొక్క శేఖర్, డ్రైవర్ బత్తిని బాలచంద్రు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక డంప్ సీజ్

బిజినేపల్లి: మండలంలోని మమ్మాయిపల్లి శివారులో డంప్ చేసిన ఇసుకను తహసీల్దార్ శ్రీరాములు గురువారం సీజ్ చేశారు. కొద్ది రోజుల క్రితం మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన అమరేందర్ స్థానిక వ్యవసాయ పొలాల్లో లభించిన ఇసుకను సేకరించి వెంకటస్వామి పొలంలో అక్రమంగా బద్రపర్చాడు. ఇసుకను తొలగించాల ని సదరు రైతు ఫిర్యాదు చేయడంతో గిర్దావరి గురువారం పంచనామా నిర్వహించారు. పొలంలో దాదాపు 90 ట్రాక్టర్ల ఇసుక నిల్వ ఉంటుందని అంచనా వేశారు. ఇసుక మొత్తాన్ని త హసీల్దారు కార్యాలయానికి లేదా, పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని అధికారులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

● ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిజినపల్లి, తిమ్మాజిపేట, తెల్కపల్లి మండలాలకు సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రధాన దృష్టి సారించిందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, పట్టణానికి చెందిన పలువురు కౌన్సిలర్లు, ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

నాగర్‌ర్నూల్ మున్సిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, దీనికోసం ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 1, 8, 13, 17, 22వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, ఓపెన్ డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు పూర్తి చేస్తామన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ..

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయ గ్రామాలకు సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను క్యాంప్ కార్యాలయంలో బాధితులకు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు..

తిమ్మాజిపేట: మండలంలోని పుల్లగిరి, ఎదిరేపల్లి, బాజీపురం, ఇప్పలపల్లి, ఆవంచ గ్రామాలకు చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

కురుమూర్తిస్వామి సన్నిధిలో ఎమ్మెల్యేదంపతులు

చిన్నచింతకుంట: అమ్మాపూర్ కురుమూర్తి స్వామిని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

కనులపండువగా కల్యాణోత్సవం



కోడేరు: మండల కేంద్రంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ తెలిపారు.

ఘనంగా రథోత్సవం



కల్వకుర్తిరూరల్: మండలంలోని రామగిరిలో సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం వేకువజామున రథోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

అదనపు కలెక్టర్‌కు వినతి



నాగర్‌కర్నూల్ రూరల్: తెలకపల్లి మండల కేంద్రంలో మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో స్వేరోస్ నాయకులు ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించడంతో వారిపై కేసులు పెట్టడమేంటని ప్రశ్నిస్తూ గురువారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రజా సమస్యల మీద పోరాడుతున్న స్వేరోస్ నా యకులు మీద కేసులు బనాయిస్తున్నారని స్వేరోస్ జిల్లా సహాయ కార్యదర్శి మిద్దె ధర్మరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్, మబ్బు రాము, సంపత్‌కుమార్, మల్లేష్, కాశీం, పరమేష్, రాము పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం: కేసు నమోదు

తెలకపల్లి: సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో మహాత్మాజ్యోతి బాపూలే బాలికల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చందన, వైష్ణవిలు శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, ఈ నెల 12న రాత్రి 8.30 గంటలకు వారిని పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, నర్సు సరస్వతి మండల కేంద్రంలోని దివ్య క్లినిక్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారు. తెలకపల్లికి చెందిన రెడ్డపాకుల శివ శంకర్ దివ్య క్లినిక్‌కు వెళ్లి విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ అయ్యిందని పేర్కొన్నాడు. అదే రోజు రాత్రి 11 గంటలకు పాఠశాలకు శివశంకర్, ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌కు చెందిన శేఖరాచారి, సీఈఓ స్కిప్ ట్విట్టర్ అకౌంట్‌కు సంబంధించిన వంగ వినోద్‌గౌడ్‌లు గురుకుల పాఠశాల విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ అయ్యిందని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆదోని రత్నం ఎస్ఐకి తెలిపారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు రెడ్డపాకుల శివశంకర్, ఓ న్యూస్ ఛానల్‌కు సంబంధించిన శేఖరాచారి, సీఈఓ ట్విట్టర్‌కు సంబంధించిన వంగ వినోద్‌గౌడ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బిజినేపల్లి: మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన చెన్నమ్మ(50) బుధవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ఖానాపూర్ గ్రామానికి చెందిన చెన్నమ్మ బుధవారం రాత్రి పడుకున్న చోటనే మృతి చెందింది. గురువారం అంత్రక్రియలు చేసే సమయానికి ఆమె ఒంటిపై గాయాలు ఉండడంతో గమనించిన కుటుంబ సభ్యులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

● ఎమ్మెల్యే వంశీకృష్ణ



లింగాల మండలం జీల్లపల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల: గ్రామాలాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో సీసీరోడ్ల పనులకు గురువారం ఎమ్మెల్యే భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రోడ్ల బాగు కోసం నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అంబట్‌పల్లి, దారారం, జీల్లుపల్లి, సూరాపూర్, చెన్నంపపల్లి, రాయవరం, వల్లభాపూర్, మాడాపూర్, అవుసలికుంట, కొత్తచెర్వుతండా తదితర గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే రోడ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాసరావు, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రాథోడ్, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు, లక్ష్మణ్‌నాయక్, రాజునాయక్, సుధాకర్‌గౌడు, యాదయ్య, బొందయ్య, ఇందిరమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు



వెల్దండ మండల రాచూర్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

వెల్దండ: మండలంలోని రాచూర్, బైరాపూర్, భర్కత్‌పల్లి, గుండాల తదితర గ్రామాల్లో గురువారం జాతీయ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సభ్యులు గ్రామ సభలను నిర్వహిచారు. ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు, నిధుల ఖర్చులు తదితర వాటిని వివరించారు. రాచూర్‌లో రూ.32.59లక్షలతో పను లు చేసినట్లు తెలిపారు. వెల్దండలో రూ.17.18లక్షలు, బైరాపూర్‌లో రూ.33.30లక్షలు, గుండాలలో రూ.9.63లక్షలు, భర్కత్‌పల్లిలో రూ.13.07లక్షలు, చెర్కూర్‌లో రూ.20.44లక్షలు, లింగారెడ్డిపల్లిలో రూ.12.94లక్షలు, శంకరకొండతండాలో రూ.8.11 లక్షలు, ఉబ్బలగట్టుతండాలో రూ.12.78లక్షలు, అల్లంతోట బావితండాలో రూ.11.26లక్షలు, రాఘయపల్లిలో రూ.19.59లక్షలు, పల్గుతండాలో రూ.3.91లక్షలు, నగారగడ్డతండాలో రూ.8.13లక్షల నిధులతో ఉపాధి హామీ పనులు చేసినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఈశ్వర్‌జీ, గ్రామాల టీఏలు, కార్యదర్శులు, డీఆర్‌పీలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

నేడు మండల ప్రజావేదిక..

ఈనెల 14న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీఓ ఈశ్వర్‌జీ తెలిపారు. కార్యక్రమానికి డీఆర్‌డీఓ కార్యాలయం నుంచి జిల్లా అధికారులు హాజరవుతారని తెలిపారు.

కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి



యజమానికి సూచనలిస్తున్న డాక్టర్ శ్రావణి

తిమ్మాజిపేట: మండలంలోని పలు గ్రామాల్లో కోళ్ల పెంపకందారులు ఏవీఎస్ ఇన్ఫ్లూంజా వ్యాధిపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఆవంచ పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణి సూచించారు. మండలంలోని ఆవంచ, ఇప్పలపల్లి తండాలో కోళ్ల ఫారాలను డాక్టర్ శ్రావణి, డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, పశు వైద్య సిబ్బంది సందర్శించి, యజమానులకు, ఫామ్‌లో పనిచేసే కార్మికులకు పలు సూచనలు చేశారు. వ్యాధి లక్షణాలు, వ్యాధి నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చనిపోయిన కోళ్లను, పక్షులను లోతైన గొయ్యితీసి అందులో పాతిపెట్టి సున్నంతో, మట్టితో కప్పడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారించవచ్చన్నారు. మండలంలో ఇప్పటి వరకు ఎలాంటి వ్యాధులు సోకలేదని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.

విద్యాంజలి 2.0పై అవగాహన సదస్సు




అచ్చంపేటలో నిర్వహించిన విద్యాంజలి2.0 అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెంకట్

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం విద్యాంజలి 2.0 సంక్షేమ కార్యక్రమం ఏర్పాటు చేసిందని విద్యాంజలి మేనేజర్ వెంకట్ అన్నారు. గురువారం అచ్చంపేట జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గిరిజన హాస్టల్స్ వార్డెలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో సొల్యూషన్ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో విద్యాంజలి కార్యక్రమం జరుగుతుందన్నారు. సెబ్జెక్టు టీచర్స్, ఇంగ్లిష్ టీచర్స్, యోగ ట్రైనర్, కంప్యూటర్ ట్రైనర్, కరాటే ట్రైనర్, అటెండర్, స్వీపర్లు, రాత్రి పగలు వాచ్‌మేన్‌లు ఉంటారని, అనంతరం ఈ సొల్యూషన్ వారి సౌజన్యంతో విద్యాంజలి 2.0 అనే బృహత్తర కార్యక్రమం అని అన్నారు. గిరిజన విద్యార్థులు ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఫిరంగి, అనంత ఈ సొల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ మధు కిరణ్, సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్ సుధాకర్, శేఖర్, గిరిజన సంక్షేమ హాస్టల్స్ వార్డెన్లు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో నిధుల దుర్వినియోగం

చారకొండ: మండలంలో జరిగిన జాతీయ ఉపాధి పనుల్లో రూ.57,666 దుర్వినియోగమయ్యాయని, వాటిని రికవరీ చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని మర్రిపల్లిలో ఎంఆర్‌సీ కార్యాలయంలో 2023-24లో రూ.25.90 కోట్ల పనులపై 3వ విడత సామాజిక తనిఖీలో భాగంగా మండల ప్రజావేదిక నిర్వహించారు. మండల వ్యాప్తంగా రూ.57,666 దుర్వినియోగం అయినట్లు వివరించారు. కార్యదర్శులకు, టీఏలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.28 వేల పెనాల్టీ విధించారు. నిధులను వెంటనే రికవరీ చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ ఆదేశించారు. సమావేశంలో ఏపీడీ చంద్రశేఖర్, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య, డీవీఓ నసిరొద్దీన్, ఏవీఓ రాజు, అంబుడ్స్ పర్సన్ జంగయ్య, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు ఉన్నారు.

రోడ్డు నిర్మాణం కోసం సర్వే



కొల్లాపూర్: కొల్లాపూర్ – చౌటబెట్ల మీదుగా చింతలపల్లి వరకు నూతనంగా నిర్మించనున్న బీటీ రహదారి పనుల కోసం పంచాయతీరాజ్ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. ఇటీవల రూ.4.95 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభం సందర్భంగా అధికారులు సర్వే చేపట్టారు. కొల్లాపూర్ నుంచి చౌటబెట్ల వరకు, తాళ్లనర్సింగాపురం – చింతలపల్లి వరకు బీటీ నిర్మాణం, కల్వర్టులు, సీసీ నిర్మాణాలు ఏఏ ప్రాంతాల్లో చేపట్టాలనే అంశాలను ఏఈ సాయిరాం పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు కమలాకర్‌రావు, వంగ రాజశేఖర్‌గౌడ్, బిచ్చారావు, భాస్కర్‌రావు ఉన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి: క్రీడాకారులు క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శ్రీ భూనీల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ కబడ్డీ జాతీయ స్థాయి, వాలీబాల్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి క్రీడాకారులకు మంత్రి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ చూపాలన్నారు. వాలీబాల్ పోటీలలో కల్వకోల్ జట్టు మొదటి బహుమతి, రెండో బహుమతి గంట్రావ్‌పల్లి జట్టు గెలుచుకుంది. కబడ్డీ మొదటి బహుమతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం మిషన్ జట్టు, రెండో బహుమతి హైదరాబాద్ కాసాని అకాడమీ జట్టు, మూడో బహుమతి కంచిరావుపల్లి జట్టు, నాల్గవ బహుమతి దోమలపెంట జట్టు గెలుచుకున్నాయి. గెలుపొందిన క్రీడాకారులకు కప్‌తో పాటు ప్రైజ్‌మనీ మోడల్ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్, ఎస్ఐ సతీష్, మైసమ్మ చైర్మన్ శ్రీనివాసులు, వెంకటేశ్వరావు, గోపాల్‌రావు, సత్యం, చిన్నయ్య, శంకర్, రమేష్, చారి, విష్ణు పాల్గొన్నారు.

తిర్మలాపూర్‌లో గోవింద నామస్మరణ



దేవల్‌తిర్మలాపూర్‌లో శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్‌లో శ్రీభూనీల సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రథంపై శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు తేరును ప్రారంభించారు. దేవాలయం నుంచి పాఠశాల వరకు తేరును భక్తులు లాగారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణంతో తిర్మలాపూర్ మార్మోగింది. తేరును తిలకించడానికి ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో పూరోహితులు శేషాచార్యులు, శేఖర్ శర్మ, సత్యం, శ్రీనివాసులు, విజ్జయ్య, ఆంజనేయులు, సోమిశెట్టి లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు పీఆర్ జగదీశ్వర్‌రావు, ప్రతాప్‌గౌడ్, వెకటేశ్వర్‌రావు, శ్రీనివాసులు, విష్ణు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ధ్యానంతో జబ్బులు మాయం



యాపట్లలో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి

పెద్దకొత్తపల్లి: ప్రజలు ధ్యానం చేయడం ద్వారా జబ్బులను మాయం చేసుకోవచ్చని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, జ్ఞానేశ్వరి అన్నారు. గురువారం పాత, కొత్త యాపట్ల, మారేడు మాన్‌దిన్నె గ్రామాల్లో ధ్యానంపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజలు, విద్యార్థులు జ్ఞాన సాధన ద్వారా జబ్బులను తగ్గించుకోవచ్చన్నారు. బీపీ, షుగర్, గుండె జబ్బులను ధ్యానం ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. విద్యార్థులు బాల్యదశలోనే ధ్యానం చేయడం ద్వారా భవిష్యత్‌లో వ్యాధులులేని జీవితం పొందవచ్చన్నారు. మారేడు మాన్‌దిన్నె, యాపట్ల పాఠశాలల్లో విద్యార్థులతో ధ్యానం చేయించారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు ప్రవీణ్, శైలజ, మల్లేశ్వర్ రెడ్డి, బాలమ్మ, సవారయ్యలు పాల్గొన్నారు.

రైస్ మిల్లును సందర్శించిన ఎమ్మెల్యేలు



తిమ్మాజిపేట: మండలంలోని రాళ్లచెరువుతండా సమీపంలో నూతనంగా నిర్మించిన రైస్‌మిల్లును నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిలు గురువారం సందర్శించారు. రైస్‌మిల్లు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఇద్దరు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట, జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు



చారకొండ: బైపాస్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి వారికి సంఘీబావం తెలిపి మాట్లాడారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. తక్షణమే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బాధితులు నల్ల కిరణ్, జెల్ల అలివేలు, చిట్టెమ్మ, చంద్రకళ, లాలమ్మ, సుమతమ్మ, వెంకమ్మ, అశోక్ రెడ్డి ఉన్నారు.

యువతి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యం కావడంతో గురువారం కేసు నమోదైనట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మున్సిపాల్టీ పరిధిలోని దేశిటిక్యాల గ్రామానికి చెందిన నాగలక్ష్మి ఈనెల 11న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తల్లి వసంత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

కల్వకుర్తిరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ వెంకటరాములు వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలను నాయకులను అడిగారు. ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



తాడూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించరాదని కాంప్లెక్స్ హెచ్ఎం అనిల్‌రెడ్డి అన్నారు. గురువారం ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వంట నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భోజనం తయారుకు నాణ్యమైన సరుకులను వాడాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందజేయాలన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



తాడూరు: మండలంలోని పాపగల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ కార్యకర్త కెంగూరి రాజు గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందడంతో పార్టీ ప్రమాద బీమా పథకం కింద మంజూరైన రూ.2 లక్షల చెక్‌ను మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి, ఇంద్రకల్ మాజీ సర్పంచ్ బొడ్డు రమణ, జలీల్, మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా సరోజిని నాయుడు జయంతి

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సరోజిని నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం ఆంగ్ల దినోత్సవంతో పాటు జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిందని ఎంఈఓ సత్యనారాయణశెట్టి విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఆంగ్లంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

లింగాల: బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు ఉంటాయని షీ టీం హెడ్ కానిస్టేబుల్ పద్మ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా వేధింపులకు గురిచేస్తే షీ టీం దృష్టికి తీసుకరావాలని ఆమె విద్యార్థినులకు సూచించారు. 100 లేదా 8712657676 నెంబర్‌కు డయల్ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బషీర్ అహ్మద్, వెంకట్‌నాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.